కరీంనగర్ వార్త
కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల
మంగళవారం 14, నవంబర్ 2023 8 పేజీలు

## రాజన్న ఆలయంలో ఘనంగా దీపావళి వేడుకలు



16లో...

# ఆనందోత్సవాలతో దీపావళి సంబరాలు



### దీపాల శోభను సంతరించుకున్న ఊరువాడ

### బాణాసంచా కాల్చిన పిల్లలు, పెద్దలు

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** దీపావళి పర్వదిన వేడుకలను ప్రజలు ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఊరు, వాడ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పిల్లలు, పెద్దలు బాణాసంచాలు కాల్చి ఆనందోత్సవాలతో దీపావళి వేడుకలను జరుపుకున్నారు. గ్రామాల్లోని వీధులన్ని దీపావళి శోభను సంతరించుకున్నాయి.

2 లో..

## ఎపిక్ కార్డులను త్వరగా పంపిణీ చేయాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ ప్రభాతవార్త:** జిల్లాలో ఇంకను పంపిణీ చేయకుండా మిగిలి ఉన్న ఏపీక్ కార్డులను త్వరితగతిన పంపిణీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఎపిక్ కార్డుల పంపిణీపై పోస్టల్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. జిల్లాలో ఏపిక్ కార్డులు ఇంకా ఏమైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే పంపిణీ చేయాలని పోస్టల్ అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పవన్ కుమార్, కరీంనగర్ పోస్టల్ సూపర్డెంట్ శివాజీ, హాస్టల్ సూపర్డెంట్ సునీల్ కుమార్, పోస్ట్మాస్టర్ పవన్ కుమార్, కాళీ చరణ్, తహసీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ పకడ్బంధీగా నిర్వహించాలి

### రామగుండం పోలీస్ కమీషనర్ రెమా రాజేశ్వరీ



2లో...

## నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:** పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. సోమవారం కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని సందర్శించి, నామినేషన్ల స్క్రూటిని ప్రక్రియను పరిశీలించారు.




2 లో..

# ఘనంగా దీపావళి సంబరాలు..భక్తి శ్రద్ధలతో ధనలక్ష్మి పూజలు

రుద్రంగి ప్రభాతవార్త :



దీపావళి పండుగను ఆదివారం రుద్రంగి మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వాపారస్తులు వారి వారి దుకాణాల్లో ధనలక్ష్మి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను వారి కుటుంబ సభ్యులు, బంధువులకు అంద జేశారు. ఇంటింటా పిల్లలు, యువతీ యువకులు, పెద్దలు పటాకులు కాల్చి ఆనందోత్స హాలతో పండుగ సంబరాలు జరుపుకున్నారు. దుకాణాలు, ఇళ్లన్నీ రంగురంగుల విద్యుత్ దీపాలతో మిరుమిట్లు గొలిపాయి. దీపావళి పర్వదినం సందర్భంగా ఎంపీపీ గంగం స్వరూపరాణి, జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, వైస్ ఎంపీపీ పీసరి భూమయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు మండల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి గెలుపుకు సూచికగా దీపావళి జరుపుకోవడం జరుగుతుందని ఈ దీపావళి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు కోరుకున్నారు.

## ఫుట్ బాల్ విజేతలుగా పెద్దపల్లి, కరీంనగర్ జట్లు

యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త.



ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 14 బాలుర, బాలికల ఫుట్ బాల్ టోర్నమెంట్ సోమవారం యైటింక్లయిన్‌కాలనీ స్పందన మోడల్ స్కూల్ ఆధ్వర్యంలో జరిగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్ జిల్లాల నుంచి 140 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలుర విభాగంలో పెద్దపల్లి జట్టు కరీంనగర్ జట్టుపై 1-0 తేడాతో గెలుపొందగా, బాలికల జట్టు పెద్దపల్లి జట్టుపై కరీంనగ్ జట్టు విజయం సాధించారు. టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన జట్లకు ఓసిపి 1 బేస్ వర్క్‌షాప్ హెచ్‌ఓడి నజీర్, సెస్టోబాల్ సౌత్ జోన్ చైర్మన్ జక్కుల దామోదర్ రావు విశిష్ట అతిథులుగా పాల్గొని, క్రీడాకారులకు ట్రోఫీలను అందజేశారు. క్రీడలతోపాటు చదువు కూడా అవసరమని, నిత్యం సాధన వల్ల క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని అతిథులు అన్నారు. అత్యంత ప్రతిభ కనబరిచిన వివిధ జిల్లా జట్ల నుంచి క్రీడాకారులను ఎంపిక చేసి ఈ నెల 17వ తేదీ నుంచి జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపున్నామని పెద్దపల్లి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి పాఠశాల హెడ్ మాస్టర్ సుందర్ రావు, సంతోష్ కుమార్, కరీంనగర్ సెక్రటరీ శ్రీనివాస్, పిఈటిలు శంకరయ్య, రవి కుమార్, నక్క శ్రీనివాస్, సోమశేఖర్, చంద్రవేఖర్, కె.సత్యనారాయణ, జాఫర్, ముకేష్ కుమార్, మల్లేష్ తదితరులున్నారు.

## నీటి సరఫరాలో అంతరాయం

యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త.

గోదావరిఖని ఇన్‌టెక్ వెల్ వద్ద పైపుల మరమ్మత్తులు చేస్తున్న దృష్ట్యా వారం రోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆర్జీ 2 డిజిఎం పర్సనల్, అధికార ప్రతినిధి జి.రాజేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రోజు విడిచి రోజు నీటి సరఫరా ఉంటుందని, కాలనీ, పోతనకాలనీల వాసులు దీన్ని గమనించి, నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

## గిర్నిబావిలో గుర్తుతెలియని వ్యక్తుల చోరీ

దుగ్గొండి, నవంబర్ 12, ప్రభాతవార్త

మండలంలోని గిర్నిబావిలో ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన సోమవారం నెలకొంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన సరోజన ఇంట్లో ఒక్కరే ఉంటున్నార న్నారు. గత వారం రోజుల నుండి ఆరోగ్యం బాగా లేక హన్మకొండలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారన్నారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో తాళంను పగల గొట్టారన్నారు. ఇంటిపక్కల వారు గమనించి సమాచారం ఇచ్చారన్నారు. ఇంటికి వచ్చే సరికి తాళం పగలకొట్టారన్నారు. ఇంట్లో ఉన్న బీరువా తాలం పగలకొట్టి అందులో నగదు రూ.28వేలు, ఒక గ్రాము ముక్కు పుడుక, ఒక గ్రాము పుస్తే, రూపాయలు 15వేల విలువగల నాలుగు తులాల వెండిగాజులు, మట్టెలు మొత్తం 41వేల విలువగల సొమ్మును ఎత్తుకెళ్లారన్నారు. దొంగతనం చేసిన వారిని పట్టుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం నల్ల మనోహర్ రెడ్డి

పెద్దపల్లి, ప్రభాతవార్త.



ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తంగా నల్ల మనోహర్ రెడ్డి. పెద్దపల్లి పట్టణంలోని బందారికుంటకు చెందిన సార్ల భార్గవ కుమారుడు 3 సంవత్సరాల సార్ల కార్తీక్ బ్లడ్ ఇన్ఫెక్షన్‌తో ప్రాణాపాయ స్థితిలో బాధ పడుతూ హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో అడ్మిట్ కాగా బిల్ 28లక్షల 60వేలు అయ్యింది. వారు 9లక్షల 60వేలు చెల్లించగా, మిగతా 19లక్షల రూపాయలు ఎన్‌జిఒ ద్వారా యువజన నాయకులు, నల్ల ఫౌండేషన్ వ్యవస్థాపకులు నల్ల మనోహర్ రెడ్డి ఇప్పించి, ఆ కుమారుని ప్రాణానికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఆ బాలుడు ఆసుపత్రి నుంచి డిస్‌ఛార్జ్ కాగా, ఈ మేరకు సోమవారం వారి ఇంటికి వెళ్లి ఆయన పరామర్శించి, మనోధైర్యం అందించారు.

## స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహం

చందుర్తి, ప్రభాతవార్త.



చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన రేగుల బాబు (35) అనే యువకుడు ఫిట్స్‌తో గత నాలుగు రోజుల క్రితం కువైట్ ఆసుపత్రిలో మృతి చెందగా, మృతదేహం సోమవారం స్వగ్రామానికి చేరుకుంది. జిడబ్ల్యూఎసి (గల్ఫ్ సంక్షేమ సంఘం) వారు బాబు మృత దేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు ఏర్పాట్లు చేసింది. ఉపాధి నిమిత్తం సంవత్సరం క్రితం బాబు కువైట్‌కు వెళ్లి అక్కడ ఓ కంపెనీలో విధులు నిర్వహి స్తున్నాడు. కంపెనీలో పనులు ముగించుకొని శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చి పడుకున్న సమ యంలో ఫిట్స్ రావడంతో స్నేహితులు ఆసుపత్రికి తరలిం చగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. జిడబ్ల్యూఎసి కువైట్ అధ్యక్షులు మగిడె ఆనంద్, ప్రధాన కార్యదర్శి కటకం రవి ఆధ్వర్యంలో శవాన్ని రప్పించారు. బాబు శవపేటిక ఇంటికి రావడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. భార్య కల్యాణి, చిన్నారి పిల్లలు శవ పేటికపై పడి రోధించడం పలువురిని కలిచివేసింది. గ్రామానికి చెందిన నాయకులు లింగంపల్లి బాబు శవం వచ్చేందుకు ఎప్పటికప్పుడు జిడబ్ల్యూఎసి నాయకులతో చర్చించారు.

# నేరాలు-దారుణాలు

## కౌలు రైతు మృతి

కోరుట్ల రూరల్, ప్రభాతవార్త:



మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన కౌలు రైతు మహమ్మద్ ముస్తాక్ కరెంటు వైర్ తగిలి మృతి చెందాడు.స్థానికుల వివరాల ప్రకారం వ్యవసాయ భూమి వద్ద పడి ఉన్న కరెంటు వైర్ చూట్టుతుండగా ప్రమాదవ శాత్తు షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య పిర్యాదు మేరకు పోలిసులు కేసు నమోదు చేసుకున్నారు.

## సర్వాపూర్ లో నిప్పంటుకొని గడ్డివాము దగ్ధం

మల్యాల, ప్రభాత వార్త:



మల్యాల మండలం సర్వాపూర్ గ్రామంలో సోమవారం ఉదయం జరిగిన అగ్ని ప్రమాదంలో ఉప్పరి రవీందర్ కు చెందిన గడ్డివాము దగ్ధమైంది. ఇళ్ళ సముదాయంలో అజాగ్రత్తగా స్మోకింగ్ వల్ల ఈ ప్రమాదం సంభవించినట్లు తెలిసింది. అయితే వెంటనే స్థానికులు జగిత్యాల ఫైర్ స్టేషన్ కి సమాచారం అందించగా హుటాహుటిన ఫైర్ ఇంజన్ సంఘటన స్థలానికి చేరుకోవడంతో చుట్టుపక్కల ఇండ్లకు భారీ నష్టం తప్పినట్లు అయింది. అంతేకాకుండా ఫైర్ ఇంజన్ సిబ్బంది అప్రమత్తత వల్ల కేవలం రూ. 18వేల గడ్డికుప్ప మాత్రమే నష్టం కాగా సుమారు రూ. 15 లక్షల విలువ చేసే గడ్డివాము ప్రమాదం నుండి రక్షించగలిగారు. జగిత్యాల ఫైర్ స్టేషన్ అధికారి కొమురయ్య తో పాటు లైవ్ ఫోర్స్ సిబ్బంది ప్రశాంత్, మధు పాల్గొన్నారు.

## అక్రమంగా బొగ్గు రవాణా చేస్తున్న సింగరేణి కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

పెద్దపల్లి, ప్రభాతవార్త.

గోదావరిఖని 11వ ఇంక్లయిన్‌మైన్ నుంచి రాఘవాపూర్ రైల్వే స్టేషన్‌కు తరలించాల్సి న బొగ్గును కాంట్రాక్టర్ నర్సింగ రావు పెద్దపల్లి పరిధిలోని ఇటుక బట్టీలకు అక్రమంగా తరలించి, అధిక రేట్లకు అమ్ముకుంటున్న సమాచారం మేరకు రంగంపల్లి వద్ద సింగరేణిలో పని చేసేటువంటి జూనియర్ ఇన్‌స్పెక్టర్ ఉమేష్, సిబ్బంది టిఎస్ 25 టి 3939 గల నెంబర్ గల లారీని పట్టుకున్నారు. జూనియర్ ఇన్‌సె ్పక్టర్ ఫిర్యాదు మేరకు కాంట్రాక్టర్ నర్సింగ రావుపై డ్రైవర్ కార్తీక్‌పై కేసు నమోదు చేసినట్లు పెద్దపల్లి ఎస్ఐ ఎ.మహేందర్ తెలిపారు.

## గుడిపేటలో అగ్ని ప్రమాదం

### - సర్టిఫికేట్లు దగ్ధం

చందుర్తి, ప్రభాతవార్త.

చందుర్తి మండలం జోగాపూర్ అనుబంధ గ్రామమైన గుడిపేట గ్రామంలో బేడ బుడిగ కాలనీకి చెందిన చింతం మధుబాబు అనే విద్యార్థి సర్టిఫికేట్లు దీపావళి రోజున ఆదివారం అగ్నికి ఆహుతయ్యాయి. దీపావళి పండుగ రోజున వెలిగించిన దీపం కింద పడటంతో పక్కనే ఉన్న పదవ తరగతి సర్టిఫికేట్లు, 5000 రూపాయల నగదు కాలిపోయాయి. సంఘటన స్థలాన్ని ఎంపిటిసి మ్యాకల గణేష్, ఇతర ప్రజాప్రతినిధులు సందర్శించి, విద్యార్థిని ఓదార్చారు. విద్యార్థి కాలిపోయిన సర్టిఫికేట్లను తిరిగి అందించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

# ఎన్నికల కమీషన్ మార్గదర్శకాలు పాటిస్తూ అభ్యర్థుల నామినేషన్ల స్క్రూటినీ నిర్వహణ

**- రామగుండం రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ**




**గోదావరిఖని, ప్రభాతవార్త:** ఈ నెల 3 నుంచి 10 వరకు అభ్యర్థులు సమర్పించిన నామినేషన్లను స్క్రూటినీ నిర్వహించినట్లు రామగుండం అసెంబ్లీ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ తెలిపారు. సోమవారం రామగుండం ఆర్ఓ కార్యాలయంలో నిర్వహించిన నామినేషన్ దరఖాస్తుల స్క్రూటిని కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలన అధికారి, రిటర్నింగ్ అధికారి, ఎఆర్ఓలు పాల్గొన్నారు. రిటర్నింగ్ అధికారి జె.అరుణశ్రీ మాట్లాడుతూ నామినేషన్ దరఖాస్తు ప్రక్రియ నవంబర్ 10 సాయంత్రం 3గంటలకు ముగిసిందని, స్వీకరించబడిన మొత్తం దరఖాస్తులు, స్వతంత్ర అభ్యర్థుల, రాజకీయ పార్టీల అభ్యర్థుల నామినేషన్ దరఖాస్తు పత్రాలతో అఫిడవిట్, ఇతర వివరాలపై అభ్యర్థులకు వివరణ ఇవ్వడం జరిగిందని ఆర్ఓ అరుణశ్రీ తెలిపారు. రామగుండం నియోజపక వర్గ పరిధిలో నవంబర్ 10 నాటికి మొత్తం 31 అభ్యర్థులకు గాను 51 నామినేషన్ దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, ఇందులో దరఖాస్తుల స్రూటినీ అనంతరం మొత్తం 31 అభ్యర్థులకు గాను, ఐదుగురు తిరస్కరించబడి, 26 మందికి ఆమోదం, మొత్తం 51 నామినేషన్ దరఖాస్తులకు సంబంధించి 6 దరఖాస్తులు తిరస్కరించబడి, మిగిలిన 45 దరఖాస్తులు ఆమోదం పొందినట్లు, వాటి వివరాలను అభ్యర్థుల సమావేశంలో వెల్లడించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రానా, ఆర్ఒ అరుణశ్రీ, ఎఆర్ఓలు కుమారస్వామి, రాంమోహన్ రావు, జ్యోతి, మీడియ అండ్ కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజనీ తదితరులున్నారు.

# మంథని అసెంబ్లీ నియోజకవర్గలో 4నామినేషన్ల తిరస్కృతి




**మంథని - ప్రభాతవార్త:** మంథని అసెంబ్లీ నియోజకవర్గానికి 28మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా సోమవారం జరిగిన నామినేషన్ల పరిశీలనలో 4 నామినేషన్లను తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమ నాయక్ తెలిపారు. 28 మంది అభ్యర్థులు 48సెట్ల నామినేషన్లు వేశారని అట్టి నామినేషన్ల వారి ప్రతినిధుల సమక్షంలో పరిశీలించగా వాటిలో నాలుగు నామినేషన్లను తిరస్కరించినట్లు ఆయన తెలిపారు. నామినేషన్లు తిరస్కరించిన వారిలో చల్లా సుజాత, పుట్ట శైలజ, చందుపట్ల రాంరెడ్డి, రొడ్డ వంశీకృష్ణ నామినేషన్లు ఉన్నాయని ఆయన తెలిపారు.

# ఎన్నికల నిర్వాహణ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

**- గంగాధర మండలంలో పోలీసు బలగాల కవాతు - కరీంనగర్ ఎసిపి టి కరుణాకర్‌రావు**



**గంగాధర,ప్రభాతవార్త:** త్వరలో నిర్వహించబోయే అసెంబ్లీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుగాలని కరీంనగర్ ఎసిపి టి కరుణాకంర్‌రావు అన్నారు. గంగాధర మండల కేంద్రంలోని మధురానగర్ నుండి మల్లాపూర్ రోడ్డు వరకు ప్రధానారహారి వెంట గంగాధర ఎస్సై పుల్లా అభిలాష్ ఆద్వర్యంలో ముఖ్య అతిది కేంద్ర బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు.తిరిగి అంబేద్కర్ చౌరస్తా వరకు నిర్వహించారు.ఎన్నికల వేల కేంద్ర బలగాతో కలిసి పోలసు బలగాలు ప్రజలకు బరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు.ఎలాంటి బయాబ్రాంతులకు గురికాకుండా స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.శాంతి భద్రతలు కాపాడుతూ ఎన్నికలు జరుగుతాయని అన్నారు.ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఆ కవాతులో చొప్పదండి సిఐ రవీందర్‌తో పాటు వివిధ సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కాలుష్యంపై సీనియర్ సిటిజన్స్ ప్రచారం



**జగిత్యాల టౌన్,ప్రభాతవార్త :** తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో దీపావళి సమ్మేళనం నిర్వహించారు.ఈ సందర్భంగా కాలుష్యం నివారణ అంశాలపై అసోసియేషన్ ముద్రించిన అవగాహన పత్రికలను టాస్కా రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కాలుష్యంపై అవగాహన పత్రికలను జిల్లాకేంద్రంలో,డివిజన్,మండల కేంద్రాల్లో ఇంటింటా టాస్కా ప్రతినిధులు పంచారు.ఈ సందర్భంగా హరి అశోక్‌కుమార్ విలేకరులతో మాట్లాడుతూ డిల్లీలో పెద్ద ఎత్తున దీపావళి అనంతరం గత సంవత్సరం అక్కడి ప్రజలు అధిక వాయు కాలుష్యం ఏర్పడి ఇబ్బందులు పడ్డ విషయం గుర్తు చేశారు.గాలి,శబ్ద కాలుష్యంతో,శ్వాస సంబంధించిన సమస్యలు తప్పవని వైద్యులు సూచించిన సూచనలు వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,కోశాధికారి వి.ప్రకాష్‌రావు,ఉపాధ్యాక్షులు పిసి హన్మంత్‌రెడ్డి, బొల్లం విజయ్,ఎండి యాకూబ్, కార్యనిర్వాహక కార్యదర్శులు, పి.అశోక్‌రావు, కొయ్యడ సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులు బొబ్బాటి కరుణ, రాజ్‌గోపాల్‌చారి, తదితరులు కాలుష్యంపై అవగాహన ప్రచార పత్రికలను పంచారు.

# మాతృ సేవా సంస్కృతిలో బాలల దినోత్సవ వేడుకలు



**కోరుట్ల, ప్రభాతవార్త:** బాలల దినోత్సవ వేడుకలను జగిత్యాల జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ బృందం ఆధ్వర్యంలో కోరుట్ల మాతృ సేవా సంస్కృతి ఆవాసంలో ఆశ్రయం పొందుతున్న పిల్లలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అనే నినాదంతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఆవాసంలో ప్రతి విద్యార్థి మంచిగా చదువుకొని వృద్ధిలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోట శివకుమార్, కొండ్ర రాజ్‌కుమార్, ఓటారికారి శ్రీనివాస్, నీలగిరి విజయలక్ష్మీ, ఆవాసం ఫౌండర్ కట్కం రంజిత్, సిబ్బంది కిశోర్, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన పూర్తి

**- వేములవాడలో ఇద్దరు అభ్యర్థుల నామినేషన్‌ల తిరస్కరణ**

**- సిరిసిల్లలో 23 మంది అభ్యర్థుల నామినేషన్‌లు ఓకే**




**సిరిసిల్ల బ్యూరో, నవంబర్ 13, ప్రభాతవార్త :** రాజన్న సిరిసిల్ల జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం పూర్తయింది. ఎన్నికల సాదారణ పరిశీలకులుగా డాక్టర్ జగదీష్ సోన్‌కర్ ఆద్వర్యంలో పరిశీలన చేపట్టగా పలు పార్టీల అభ్యర్థులు హాజరయ్యారు. సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గానికి 23 మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేయగా అందరి అభ్యర్థుల నామినేషన్‌లు సక్రమంగా ఉన్నాయని సిరిసిల్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆనంద్ కుమార్ తేల్చారు. వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గానికి 22 మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేయగా 20 మంది అభ్యర్థుల నామినేషన్‌లు సక్రమంగా ఉన్నాయని వేములవాడ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్ తేల్చారు. ఇద్దరు అభ్యర్థుల నామినేషన్‌లు తిరస్కరించారు. స్వతంత్ర అభ్యర్థి జెవి రవీందర్ రెడ్డి నిర్ధేశిత గడువులోగా అఫిడవిట్ సమర్పించలేని కారణంగా తిరస్కరించగా, రిజిస్టర్డ్ విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి గుగులోతు 10 మంది ప్రతిపాదకుల సంతకాలకు గాను 9 మందివే సంతకాలు సమర్పించడంతో వీరి నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. నామినేషన్‌ల ఉపసంహారణకు బుధవారం వరకు గడువు ఉంది.

# 18 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమమే



**ధర్మపురి,ప్రభాతవార్త :** అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ధర్మపురి నియోజకవర్గం నుండి ఈనెల 3 నుండి 10 వరకు 18 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేయగా,అభ్యర్థులందరి నామినేషన్లు సక్రమంగానే ఉన్నట్లు ధర్మపురి నియోజకవర్గ ఎన్నికల అధికారి దివాకర్ ఓ ప్రకటనలో తెలిపారు.ప్రధాన పార్టీ అభ్యర్థులతో పాటు,వివిధ పార్టీల అభ్యర్థులు,స్వతంత్ర్య అభ్యర్థులు 18 మంది 37 నామినేషన్ సెట్లను దాఖలుచేయగా,ఎన్నికల అధికారి తమ సిబ్బందితో కలిసి అభ్యర్థుల సమక్షంలో నామినేషన్లు పరిశీలించారు.

# చొప్పదండి అసెంబ్లీ బరిలో 17 మంది అభ్యర్థులు

**- పరిశీలనలో ఒక దరఖాస్తు తిరస్కరణ**

**చొప్పదండి ప్రభాతవార్త:** ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో చొప్పదండి అసెంబ్లి బరిలో నిలిచే అభ్యర్థుల దరఖాస్తులను ఎన్నికల అధికారి జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ పమేల సత్పతి సమక్షంలో అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించగా చొప్పదండి అసెంబ్లి బరిలో 17మంది అభ్యర్థుల దరఖాస్తులు సంతృప్తిగా ఉండగా, ఒకరి దరఖాస్తు తిరస్కరించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. ఈ మేరకు కొంకటి శేఖర్ బహుజన సమాజ్ పార్టీ, మేడిపల్లి సత్యం కాంగ్రెస్ పార్టీ, శోభ గాలన బొడిగ బిజేపి పార్టీ, సుంకె రవిశంకర్ బిఆర్ఎస్ పార్టీ, ఆంజయ్య కల్లెపల్లి తెలంగాణ ద్రావిడ ప్రజల పార్టీ, జంగం సాధన ధర్మ సమాజ్ పార్టీ, తడగొండ మల్లేశం యుగ తులసి పార్టీ, దుంపల నర్సింహబాబు జై స్వరాజ్‌పార్టీ, బంగరి మాదవ పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా, బెజ్జంకి ప్రశాంత్‌కుమార్ పిపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా డెమొక్రటిక్, లక్కం అజయ్ విద్యార్థుల రాజకీయ పార్టీ, విజయ్‌కుమార్ ఎంఎస్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, అక్కెనపల్లి సతీష్ స్వతంత్ర అభ్యర్థి, లైపల్లి ఆజయ్‌రాజ్ స్వతంత్ర అభ్యర్థి, గౌరు అజయ్‌కుమార్ స్వతంత్ర అభ్యర్థి, దాసరి విద్యాసాగర్ స్వతంత్ర అభ్యర్థి, నాగిశేఖర్ స్వతంత్ర అభ్యర్థి వీరి దరఖాస్తులు పరిశీలించగా సంతృప్తిగా ఉన్నాయి. లింగాల లచ్చయ్య స్వతంత్ర అభ్యర్థి దరఖాస్తును ఎన్నికల అధికారి తిరస్కరించారు.

# సున్నితమైన ఎన్నికల వ్యయ నియోజకవర్గాలు, ప్రాంతాల గుర్తింపుకు కమిటీ ఏర్పాటు

**- ఇంటలిజెన్స్ కమిటీ ఏర్పాటు**

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్ ప్రభాతవార్త:** రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యయ సున్నితమైన నియోజకవర్గాలు, ప్రాంతాలను గుర్తించటకు జిల్లా ఇంటిలిజెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి, కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఇంటలిజెన్స్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో జిల్లా రెవెన్యూ శాఖతో పాటు, పోలీస్, ఐటీ, జీఎస్టీ, బ్యాంకులకు చెందిన నిర్దేశిత అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. పైన తెలిపిన శాఖలకు చెందిన అదికారులు డిస్టిక్ ఇంటలిజెన్స్ కమిటీలో సభ్యులుగా ఉండి గత అసెంబ్లీ, పార్లమెంటరీ ఎన్నికల సమయంలో చేసిన ఖర్చు చేసిన డబ్బు, మద్యం ఇతర వస్తువుల పంపనీ పట్టివేతలు సమాచారం ఆధారంగా ప్రాథమిక నివేదిక ఏర్పాటు చేయాలన్నారు. ఆ నివేదిక ఆధారంగానే జిల్లాలోని సున్నితమైన వ్యయ అసెంబ్లీ నియోజకవర్గాలు, ప్రాంతానలు ఎన్నికల సంఘం గుర్తించి తదనుగుణంగానే, వాటిని ప్రత్యేకంగా పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ.. ఎన్నికల పోల్ జరిగే వరకు ఎప్పటికప్పుడు నివేదికలు తయారు చేస్తూ ఉండాలన్నారు. గత ఎన్నికల్లో సమర్పించిన నివేదికలతో పాటు ప్రస్తుత సమాచారంతో పోల్చుతూ నివేదిక తయారు చేయాలన్నారు. ఎన్నికలు ముగిసే రోజు వరకు వ్యయాలపై నివేదికలు తయారు చేయడం నిరంతర ప్రక్రియ అని గుర్తించాలన్నారు. జిల్లా ఇంటలిజెన్స్ కమిటీ ఏర్పాటు ముఖ్య ఉద్దేశం సమర్పించే నివేదిక ఆధారంగా ఎలక్షన్ కమీషన్ ఆయా ప్రాంతాలను ఎన్నికల వ్యయ సున్నిత ప్రాంతాలుగా గుర్తించి ప్రత్యేకంగా పర్యవేక్షిస్తుందని, ఎన్నికల సజావుగా సాగేలా చూస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏసిసి సిసిఎస్ మాధవి, ఇన్‌కమ్ టాక్స్ అదికారి డి.సుబ్బారెడ్డి, జీఎస్టీ జాయింట్ కమీషనర్ సిహెచ్.రవికుమార్, లీడ్ బ్యాంకు అధికారి ఆంజనేయులు, ఇన్‌స్పెక్టర్ తిరుమల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు, కేసులు తప్పవు

**ఎన్నికల ప్రచారంలో డీజేలకు, టపాసులకు అనుమతులు లేవు**

**ఉదయం 6 నుండి, రాత్రి 10లోపే ప్రచార టైమ్ గడువు**

**చిగురుమామిడి ఎస్సై బండి రాజేష్**

**చిగురుమామిడి, ప్రభాతవార్త:** ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో పోటీ అభ్యర్థులు తగిన చట్టపర అనుమతులు తీసుకున్న తర్వాత మాత్రమే గ్రామాల్లో ప్రచారం నిర్వహించుకోవచ్చని, ఉదయం 6గంటల నుండి రాత్రి 10గంటల సమయం దాటకుండా ప్రచారం ముగించుకోవాలని, డీజేలకు, టపాసులు పేల్చటానికి అనుమతులు లేవని చిగురుమామిడి ఎస్సై బండి రాజేష్ తెలిపారు. సోమవారం రోజున విలేకరులతో ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో ప్రచారం నిర్వహించే వారు కూడా ఉదయం 6నుండి 10లోపే ప్రచారం ముగించాలని, ప్రచార సమయంలో 10మంది కంటే ఎక్కువ మంది తిరగరాదని, ఒకవేళ ఎక్కువ మంది పాల్గొంటే తప్పని సరిగా పోలీస్ శాఖ అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రశాంత ఎన్నికల దృష్ట్యా కచ్చితంగా ప్రచార నిమిత్తం ఎన్నికల నియమావళి అనుమతులు తప్పవని ఎస్సై అంటున్నారు. ఎన్నికల నియమావళి ఎవరు ఉల్లంఘించినా వారిపై చట్టపర చర్యల్లో భాగంగా కేసులు తప్పవని, వాహనాల తనిఖీల్లో భాగంగా డబ్బు, బంగారం పట్టుబడితే సరైన పత్రాలు చూపాల్సిందేనని, రసీదులు లేకుండా డబ్బుతో పట్టుబడితే నగదు సీజ్‌తో బాటు కేసులు తప్పవన్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ గానీ, అక్రమంగా మద్యం నిల్వలు గానీ దొరికినట్లు అయితే జైలు శిక్ష తప్పదన్నారు. ఇక సోషల్ మీడియాలో కులాల, మతాలకు సంబంధించిన పోస్టులు పెట్టి రెచ్చకొట్టవద్దని, పార్టీలను గానీ, నాయకులను గానీ కించపరిచే, వివాదాస్పద వాఖ్యలు చేయవద్దని ఎస్సై బండి రాజేష్ కోరుతున్నారు.

# ధాన్యం మద్ధతు ధర పొందడానికి నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్**



**ఓదెల, ప్రభాత వార్త:** ధాన్యం మద్ధతు ధర పొందడానికి నాణ్యత ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ పేర్కొన్నారు. సోమవారం ఓదెల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... కొనుగోలు కేంద్రంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌళిక వసతులు ఉండే విధంగా చూడాలని తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్ధతు ధర పొందాలని అన్నారు. ధాన్యం విక్రయించే సమయంలో తమ వెంట సెల్‌ఫోన్ నెంబర్ ను ఆధార్‌కార్డు, బ్యాంక్ ఖాతాకు లింక్ చేసి తీసుకుని రావాలని, ధాన్యం విక్రయించే సమయంలో ఓటిపి కోసం సెల్‌ఫోన్, ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, బ్యాంక్ ఖాతా పుస్తకం తీసుకుని వచ్చే విధంగా రైతులకు ముందస్తుగా తెలియజేయాలని సూచించారు. అనంతరం సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, డిప్యూటి తహశీల్ధార్, సివిల్ సప్లైయర్ శంకర్, ఏపిఎం లతా మంగేశ్వరి, సిసి అంజిరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ అనిల్ కుమార్, ఏఈవో సంధ్య, సిసి విజయ, పవన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# మానకొండూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ అభిషేక్‌మొహంతి

**మానకొండూర్, ప్రభాతవార్త :** మానకొండూర్ పోలీస్ స్టేషన్‌ను కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్‌మొహంతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఎన్నికల నేరస్తుల, రౌడిషీటర్ల వివరాలు తెలిసుకున్నారు. వీలైనంత ఎక్కువగా ఫ్లాగ్‌మార్చ్, రూట్‌మార్చ్, వాహన తనిఖీలు నిర్వహించి ఓటర్లకు భద్రతా భావాన్ని కలిగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో వారికి కేటాయించబడ్డ ప్రాంత్ర పరిధి గురించి అడిగి తెలుసుకున్నారు. రానున్న రోజుల్లో ఎన్నికల ప్రచారం ఎక్కువగా జరగనున్నందున రెట్టించిన ఉత్సాహంతో పనిచేయాలన్నారు. మోడల్ కోడ్ ఉల్లంఘనలపై దృష్టిపెట్టాలని, గుర్తిస్తే వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో గల సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలు చేసిన లేదా



అల్లర్లను సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఓటర్లను ప్రభావితం చేసే ఎన్నికల నేరస్థులపై, రౌడిషీటర్లపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని, వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని, ఉల్లంఘిస్తే బౌండ్‌డౌన్ చేసి పూచికత్తు సొమ్ము మొత్తాన్ని జప్తు చేయాల్సి వస్తుందని, జైలు శిక్షకూడా విధించబడుతుందని సూచించారు. పాత నేరస్థుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పక్కగా అమలు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మానకొండూర్ ఎస్‌హెచ్‌ఓ ఇన్స్పెక్టర్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.




## నామినేషన్ల స్రృటిని ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి




**కరీంనగర్ ప్రభాతవార్త:** 27 చొప్పదండి (ఎస్సీ) నియోజకవర్గమునకు నామినేషన్లు వేసిన అభ్యర్థుల నామినేషన్ల స్రూటిని ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. చొప్పదండి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ వేసిన అభ్యర్థుల సమక్షంలో నిర్వహించిన 27 చొప్పదండి(ఎస్సీ) నియోజకవర్గ నామినేషన్ల స్రూటిని కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి పాల్గొని స్క్రూటీని ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి రిటర్నింగ్ అధికారి ప్రఫుల్ దేశాయ్, తహసిల్దార్ నరేందర్, వివిధ రాజకీయా పార్టీల, స్వతంత్ర అభ్యర్థులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అర్చిరీలో సిల్వర్ పథకం సాధించిన పెద్దపల్లి మధు హాసిని



**కరీంనగర్ టౌన్,ప్రభాతవార్త:** కరీంనగర్‌లోని మంకమ్మ తోటకు చెందిన పెద్దపల్లి మధు హాసిని పారమిత పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటూ తన తండ్రి పెద్దపల్లి అర్జున్ ప్రోత్బలంతో క్రీడారంగంలో రాణిస్తుంది. ఇటీవల తొర్రూర్‌లో జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి 69వ అర్చరీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ స్టేట్(ఎస్‌జీఎఫ్) అండర్ 14 గర్ల్స్ అర్చరీ విభాగంలో తెలంగాణ రాష్ట్రం నుంచి మధు హాసిని తన ప్రతిభతో కాంపౌండ్ విభాగంలో సిల్వర్ పతాకం సాధించి నేషనల్ విభాగానికి ఎంపికైనట్లు కోచ్ శ్రీనివాస్ తెలిపారు. మధు హాసిని ప్రస్తుతం కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతూ, చదువు పట్ల ఆసక్తి కనబరుస్తుంది. మధు హాసిని సిల్వర్ పథకం సాధించడం పట్ల స్కూల్ యాజమాన్యంతో పాటు, పలు సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ దేశానికి ఇంకా ఎన్నో పథకాలు తేవాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.

## కొండపల్కలలో యువకుడి ఆత్మహత్య



**మానకొండూర్, ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండపల్కల గ్రామానికి చెందిన శ్రీరాముల మోహన్(33)అనే యువకుడు జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొని మృతిచెందినట్లు మానకొండూర్ సీఐ రాజ్‌కుమార్ సోమవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండపల్కల గ్రామానికి చెందిన శ్రీరాముల మోహన్ వృత్తిరిత్యా మంగలిగా పనిచేసుకుంటున్నాడు. మృతుడు మోహన్‌కు వెన్నుపూస భాగం అనారోగ్యంతో బాధపడుతూ ఎన్ని ఆసుపత్రులు తిరిగిన రోగం నయంకాకపోవడంతో ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంటి ఆవరణలో ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని మృతిచెందాడు. నామృతికి ఎవరు కారణం కాదని, అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఓ లేఖలో రాశాడని తెలిపారు. మృతుని భార్య రజని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. మృతుడు మోహన్‌కు భార్య రజని, యశ్వంత్, హన్సిక ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# కాంగ్రెస్ వైరల్ ప్రకటన ప్రచారంపై ఎలక్షన్ కమిషన్ ఒత్తిడి

## పెద్దపల్లి జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు కల్వల శ్రీనివాస్



జూలపల్లి,ప్రభాతవార్త : జూలపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పెద్దపల్లి జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు కలవల శ్రీనివాస్ మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ చేస్తున్న పదేండ్ల అహంకారం పోవాలి కాంగ్రెస్ రావాలని విషయంపై వైరల్ ప్రకటనను బిఆర్ఎస్ నేతలు ఓడిపోతారని భయంతో ఈసీపై ఒత్తిడి తెచ్చారని,కాంగ్రెస్ పార్టీ తీసుకోలేదని శ్రీనివాస్ ప్రశ్నించారు. తన అహంకారంతో ఒంటెద్దు పోకడలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా మాజీ ఎస్సీ సెల్ అధ్యక్షులు కల్వల శ్రీనివాస్,యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు మానుబండ్ల శ్రీనివాస్,యూత్ కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కోరెపు సంపత్,రైతు సమన్వయ కమిటీ మండలాధ్యక్షులు సిరికొండ కొమురయ్య,బీసీ సెల్ మండల అధ్యక్షులు బండి స్వామి,పొట్యాల బిరయ్య, ఎండి పజ్జు,నెరుపట్ల అంజయ్య, చింతమల్ల రాములు,తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఐరనప్ టాబ్లెట్‌ల పంపిణీ



కాల్వశ్రీరాంపూర్,ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం ఐరన్ ట్యాబ్లెట్ల పంపిణీ జరిగింది. ఉన్నత పాఠశాలలోని ఎనిమిది, తొమ్మిది, పదవతరగతి, విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వ డాక్టర్ మహేందర్ ఆధ్వర్యంలో ఐరన్ గోలీలు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం.సునీత, హెల్త్ సూపర్వైజర్ సరోజ,ఏఎన్ఎం సరోజన,ఆశా కార్యకర్తలు శారధ, సరోజన, భూలక్ష్మి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ సంఘ మహిళా అధ్యక్షురాలుగా కళ్యాణి

**కోరుట్ల, ప్రభాతవార్త**

జగిత్యాల జిల్లా ముదిరాజ్ మహిళ సంఘ నూతన జగిత్యాల జిల్లా అధ్యక్షురాలిగా పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యురాలు రేంజర్ల కళ్యాణిని నియమిస్తూ శాసనమండలి డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్ చేతుల నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ముదిరాజ్ సంఘ అభివృద్ధికి, సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానన్నారు. తన నియమానికానికి సహకరించిన డిప్యూటీ చైర్మెన్ బండ ప్రకాష్, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జనరల్ సెక్రటరీ గుండ్లపెల్లి శ్రీను, ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్యలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యూత్ కార్యదర్శి అల్లూరి జగన్, రేంజర్ల నర్సయ్య, నీలం పెద్దులు, బత్తిని మహేష్‌లతో పాటూ పలువురు ముదిరాజ్‌లు పాల్గొన్నారు.



# మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత



ఎలిగేడు,ప్రభాతవార్త : ఎలిగేడు మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన ఎన్నిగంటి రాజమ్మ అనారోగ్యంగా మరణించగా వారి కుటుంబీకులైన కోడలు ఎన్నిగంటి సత్యమ్మ వారి కూతుర్లకు ప్రగాఢ సంతాపాన్ని టిఆర్ఎస్ మండల శాఖ కార్యకర్తలు తెలియజేశారు. నిరుపేద కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని టిఆర్ఎస్ పార్టీ మండల శాఖ,గ్రామశాఖ ముఖ్య నాయకులు,యూత్ నాయకులు బియ్యం అందజేశారు.

# 5గురి నామినేషన్ తిరస్కరణ

**కోరుట్ల, ప్రభాతవార్త**



అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా సోమవారం పోటీలో ఉన్న అభ్యర్థుల నామినేషన్‌ల స్క్రూటిని నిర్వహించగా అందులో 5గురు అభ్యర్థుల నామినేషన్‌లు తిరస్కరించినట్లు ఆర్డీఓ రాజేశ్వర్ తెలిపారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థి కల్వకుంట విద్యాసాగర్‌రావు, క్రాంతిసింగ్ అభ్యర్థి ఎడ్ల రమేష్, ఏడీఆర్ పార్టీ అభ్యర్థి నవీన్ సురకంటి, స్వతంత్ర అభ్యర్థులు ఇందూరి సత్యం, డి.నరేష్‌ల నామినేషన్‌లలో అఫడవిట్ సరిగా లేకపోవడం, అభ్యర్థికి 10మంది ప్రపోజల్స్ లేకపోవడంతో వాటిని తిరస్కరించినట్లు వివరించారు. ఈ నెల 15వరకు నామినేషన్‌ల ఉపసంహకరణ ఉంటుందన్నారు.

# గుడిపేటలో అగ్ని ప్రమాదం

## సర్టిఫికేట్లు దగ్ధం

**చందుర్తి, ప్రభాతవార్త**



చందుర్తి మండలం జోగాపూర్ అనుబంధ గ్రామమైన గుడిపేట గ్రామంలో బేడ బుడిగ కాలనీకి చెందిన చింతం మధుబాబు అనే విద్యార్థి సర్టిఫికేట్లు దీపావళి రోజున ఆదివారం అగ్నికి ఆహుతయ్యాయి. దీపావళి పండుగ రోజున వెలిగించిన దీపం కింద పడటంతో పక్కనే ఉన్న పదవ తరగతి సర్టిఫికేట్లు, 5000 రూపాయల నగదు కాలిపోయాయి. సంఘటన స్థలాన్ని ఎంపిటిసి మ్యాకల గణేష్, ఇతర ప్రజాప్రతినిధులు సందర్శించి, విద్యార్థిని ఓదార్చారు. విద్యార్థి కాలిపోయిన సర్టిఫికేట్లను తిరిగి అందించే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు.

# ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు మృతి

**ఎలిగేడు,ప్రభాతవార్త :**



ఎలిగేడు మండలం లోకపేట గ్రామానికి చెందిన నిశాంత్ 30 అనే యువకుడు జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు సేవించి మృతి చెందినట్లు జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం మృతుడు ఆటో నడుపుకుంటూ వ్యవసాయ కూలిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఆస్తులు లేకపోవడం వల్ల ఎవరు అమ్మాయిని ఇవ్వకపోవడంతో మనస్థాపానికి గురై పురుగుల మందు సేవించగా తన అన్న కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా వైద్యులు హైదరాబాద్‌కు తీసుకొని పోవాలని సూచించడంతో హైదరాబాదులో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. తన అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జూలపల్లి ఎస్ఐ తెలిపారు.

# ముస్సిపల్ యూత్ రజక సంఘం అధ్యక్షునిగా గణేష్

**సుల్తానాబాద్, ప్రభాతవార్త.**

సుల్తానాబాద్ మున్సిపల్‌యూత్ రజక సంఘం పట్టణ అధ్యక్షులుగా నిట్టూరి గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సాయిరామ్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రజక యూత్ బాడీ సమావేశం జరుగగా, రజక యువకులు అందరూ పాల్గొన్నారు. యూత్ అధ్యక్షులు నిట్టూరి గణేష్, ఉపాధ్యక్షులు నిట్టూరి శేఖర్, యూత్ కో ఆర్డినేటర్ చాతల శివ, యూత్ బాడీ సభ్యులుగా నిట్టూరి రాజు, నిట్టూరి సతీష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రశాంత్, రవి, బబ్లూ, నీరజ్, రాఖీ, సాయి, సందీప్, వేణు, అన్వేష్ తదితరులున్నారు.

# స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహం

**చందుర్తి, ప్రభాతవార్త.**

చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన రేగుల బాబు (35) అనే యువకుడు ఫిట్స్‌తో గత నాలుగు రోజుల క్రితం కువైట్ ఆసుపత్రిలో మృతి చెందగా, మృతదేహం సోమవారం స్వగ్రామానికి చేరుకుంది. జిడబ్ల్యూఎసి (గల్ఫ్ సంక్షేమ సంఘం) వారు బాబు మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు ఏర్పాట్లు చేసింది. ఉపాధి నిమిత్తం సంవత్సరం క్రితం బాబు కువైట్‌కు వెళ్లి అక్కడ ఓ కంపెనీలో విధులు నిర్వహిస్తున్నాడు. కంపెనీలో పనులు ముగించుకొని శుక్రవారం రాత్రి ఇంటికి వచ్చి పడుకున్న సమయంలో ఫిట్స్ రావడంతోస్నేహితులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. జిడబ్ల్యూఎసి



కువైట్ అధ్యక్షులు మగిడే ఆనంద్, ప్రధాన కార్యదర్శి కటకం రవి ఆధ్వర్యంలో శవాన్ని రప్పించారు. బాబు శవపేటిక ఇంటికి రావడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. భార్య కల్యాణి, చిన్నారి పిల్లలు శవ పేటికపై పడి రోధించడం పలువురిని కలిచివేసింది. గ్రామానికి చెందిన నాయకులు లింగంపల్లి బాబు శవం వచ్చేందుకు ఎప్పటికప్పుడు జిడబ్ల్యూఎసి నాయకులతో చర్చించారు.

# తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కృపాకర్

**చందుర్తి, ప్రభాతవార్త.**



తెలంగాణ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యాపకుల సంఘం (540) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాజన్నసిరిసిల్ల జిల్లా చందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పని చేస్తున్న మాడుగుల కృపాకర్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు బరిగెల నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కృపాకర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు, ఎన్నికలకు సహకరించిన రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ జి.రవికి కృతజ్ఞతలు తెలిపారు.

# మాజీ ఎంపిపి బిజెపికి రాజీనామా

**చందుర్తి, ప్రభాతవార్త.**



చందుర్తి మాజీ ఎంపిపి చిలుక పెంటయ్య బిజెపి పార్టీకి సోమవారం రాజీనామా చేశారు. పెంటయ్య గత మూడు సంవత్సరాల నుంచి బిజెపి పార్టీలో మాజీ జడ్పి చైర్ పర్సన్ తుల ఉమాతో కలిసి పని చేశారు. తుల ఉమాకు బిజెపి అధిష్ఠానం చివరి నిమిషంలో టికెట్ నిరాకరించడంతో పార్టీకి రాజీనామా చేస్తూ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. త్వరలో టిఆర్ఎస్‌లో చేరేందుకు పెంటయ్య ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

# సామూహికంగా దీపావళి పండుగ నోము

**కమలాపూర్, ప్రభాత వార్త:**
హిందువులు జరుపుకునే పెద్ద పండుగలలో దీపావళి పండుగ ఒకటి. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పండుగను జరుపుకుంటారు. ఒకప్పుడంటే ఉమ్మడి కుటుంబం, అమ్మ, నాన్న, తాతయ్య, నానమ్మ, అమ్మమ్మ, వాళ్ళ అమ్మ ఇల్లంతా సందడి సందడిగా ఉండేది. కానీ కాలం మారింది. ఉమ్మడి కుటుంబం చెదిరిపోయింది. న్యూక్లియ్ ఫ్యామిలీస్ పుట్టుకొచ్చాయి. సింగిల్ చైల్డ్ పేరెంట్స్ ఎక్కువయ్యారు. ఉరుకుల పరుగుల జీవితానికి ఇద్దరెందుకు అనుకుంటున్నారు. సంపాదన, ఫ్యూచర్, ఈ లెక్కలను తట్టుకోలేక కథ ఏనాడో కంచికి చేరింది. ఆ విధంగా ఉన్న సమయం ఇది. కానీ దానికి భిన్నంగా కులం మొత్తం ఒకటిగా ఉన్న దీపావళి పండుగ నోమును హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామ రజక కులస్థులకు చెందిన నోము 58 కుటుంబాలు కలిసి దీపావళి నోము నోముకున్నారు. ఈ నోమును తాత ముత్తాతల నుండి ప్రతి సంవత్సరం దీపావళి రోజు నమ్ముకుంటూ క్రమం తప్పకుండా ఇట్టి నోమును ఆ 58 కుటుంబాలు, వారి కుటుంబీకులు, చుట్టాలు అందరూ కలిసి ప్రతి సంవత్సరం పండుగ జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఇట్టి నోమును ప్రతి సంవత్సరం ఇలాగే కొనసాగిస్తామని వారు తెలుపుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 58 కుటుంబాల కుటుంబీకులు, వారి బంధువులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి రూ.15 వేలు అందజేత

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త :**
జగిత్యాల జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ గుట్టరాజేశ్వర స్వామి గుట్ట ప్రక్కన శివనగర్ కాలనీలో వున్న శివగాయత్రి అనాథ వృద్ధాశ్రమానికి పలువురు దాతలు ఆర్థికసాయం అందజేశారని ఆదివారం ఆశ్రమ నిర్వాహకులు సూరజ్ శివశంకర్ తెలిపారు. జగిత్యాల పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన గోవర్ధన్ రాములు జ్ఞాపకార్థం వారి సతీమణి రిటైర్డ్ ప్రభుత్వ హాస్పిటల్ నర్స్ నాగమణి రూ.10 వేలు విలువ గల బియ్యం బస్తాలు, నూనె, పప్పులు, అందజేశారు. అలాగే కృష్ణానగర్‌కు చెందిన వ్యాపారి దారం రవీందర్ సతీమణి సుఖదారాణి జ్ఞాపకార్థం రూ.5 వేలు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆశ్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొంతమంది కన్న తల్లిదండ్రుల బాగోగులు చూడకుండా పట్టించుకోవడం లేని ఈ రోజుల్లో ఆశ్రమం నిర్వహిస్తున్న వారు ధన్యులని అభినందించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధి ఎల్లా గంగరాజాం, నిర్వహణ కార్యదర్శి కనకతార, డాక్టర్ గోవర్ధన్ సురేష్‌కుమార్, (ఎండి), బాపురెడ్డి, సత్తయ్య, సుదర్శన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా దీపావళి పండగ వేడుకలు

**ధర్మపురి, ప్రభాతవార్త :**



ధర్మపురి మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో దీపావళి పండగ వేడుకల్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ధర్మపురి శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి దేవాలయ ప్రాంగణంలోని అద్దాల మేడలో లక్ష్మీపూజ నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు లక్ష్మి సూక్తం పురుష సూక్తంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయాన్ని దర్శించుకొని లక్ష్మీపూజలో పాల్గొన్నారు.

## ఘనంగా దీపావళి వేడుక

**గూడూరు, నవంబర్ 13, ప్రభాతవార్త**
మండలంలో రెండు రోజుల పాటు దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సంవత్సరం దీపావళి ఎప్పుడు జరుపుకోవాలనే దానిపై సందిగ్ధం ఏర్పడగా గత కొన్ని రోజులుగా పంచాంగ పండితులు, పురోహితులు చేసిన సూచనల మేరకు ఈనెల 12 ఈ వేడుకను ప్రారంభించారు. ద్వాపరయుగంలో లోకకంటకుడైన నరకాసురుడనే రాక్షసుడిని హోరాహోరీ యుద్ధంలో శ్రీకృష్ణుడు, సత్యభామ సంహరించిన రోజును దీపావళిగా వేడుక జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న క్రమంలో ఆరోజు ప్రతి ఇంటి ఇల్లాలు విజయానికి సంకేతంగా కుటుంబ సభ్యులకు మంగళహారతులు పట్టే ఘట్టం కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈక్రమంలో తొలిరోజు మంగళహారతులు పట్టే వేడుక జరగగా ఆ రాత్రి ఇళ్లముందు దీపాలు పెట్టారు. అన్ని గ్రామాల్లో ఈ దీపాలు అమావాస్య చీకటి తెరలను తొలగించాయి. సందర్భంగా నరకాసురుడి భారీ కటౌట్‌కు సర్పంచ్ రమేష్‌నాయక్, హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పింగిలి శ్రీనివాస్‌లతో పాటు పలువురు నిప్పంటింగా బాణాసంచాతో కటౌట్‌ను దగ్ధం చేసారు. చంద్రుగూడెం వాసులను ఈ వేడుక అలరించింది.

## పోలింగ్ కేంద్రాల తనిఖీ, సదుపాయాలు, ఏర్పాట్లపై సూచనలు

**గోదావరిఖని, ప్రభాతవార్త.**



ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేష్ సింగ్ రాణా ఆధ్వర్యంలో రామగుండం నియోజకవర్గ పరిధిలోని స్కాట్చ్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, సెక్రేడ్ హార్ట్ స్కూల్ పోలింగ్ కేంద్రాలు తనిఖీ చేసి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రాల్లోని లోపలి, బయటి గోడలపై ఉన్న స్కూల్ సంబంధిత పెయింటింగ్ చిత్రాలను పరిశీలించి, ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు అవి కనపడకుండా కవర్‌చేయాలని ఆదేశించారు. ఇపిఐసి కార్డుల పంపకాల తీరు, కొత్త ఇపిఐసి హోల్డర్లకు ఏరకంగా పంపిణీ చేస్తున్నారో బివోలను అడిగి వివరంగా తెలుసుకున్నారు. ఎన్నికల పోలింగ్ సంబంధించి, ఈ స్కూళ్ల పరిధిలో 6కు పైగా పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయని, వాటిని పరిశీలించి, ఏర్పాట్లు చేయాలని, సదుపాయాలు, మెడికల్ క్యాంప్, పార్కింగ్, భద్రతా తదితర అంశాలను పరిశీలించాలని ఆయన సూచనలు చేశారు.

## ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ..ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం

**గంభీరావుపేట, ప్రభాతవార్త:**



ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తు మాలమహానాడు ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. మాలమహానాడు జిల్లా అధ్యక్షులు దోసల చంద్రం ఆధ్వర్యంలో మాలమహానాడు నాయకులు గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మోదీ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మాదిగ ఉప కులాల బహిరంగ సభలో దేశాన్ని పాలిస్తున్న ప్రధాని మోదీ మందకృష్ణ మాదిగకు లొంగి, సుప్రీంకోర్టు వర్గీకరణ అనేది చాలా క్లిష్టమైన అంశం వర్గీకరణ అసాధ్యం మాల మాదిగలంతా ఒక్కటే దాన్నే షెడ్యూల్ కులాల ఎస్సీలని చెప్పడం స్వార్థ రాజకీయాల కోసమేనని మండిపడ్డారు. తెలంగాణలో రెండు సీట్లు రాని బీజేపీ దేశాలు, ప్రాంతాలు, కులాల మధ్య చిచ్చు పెట్టి కుంపటి రాజేస్తున్నారని ఆరోపిం చారు. దేశాన్ని నాశనం చేసే దిశగా అనుసరిస్తున్న మోదీ తీరును తక్షణమే ఓటు ద్వారా దించాలని పిలుపు నిచ్చారు. ఇచ్చిన హామిని తక్షణమే వెనక్కి తీసుకో వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార పతినిధి మల్యాల రాజువీర్, ప్రధాన కార్యదర్శి దోసల ఉపేంద్ర, నల్ల రాజ్ కుమార్, గాధం రాములు, రాజనర్సు, దోసల రామ చంద్రం, బాల్‌నర్సు, జేడి రమేష్, నాందేడ్ అనిల్ కుమార్, దోసల కార్తీక్, జక్కుల రాజు, కదారి రాజు, బరిగెల సురేష్, టేకుమల్ల చంద్రం, దోసల శ్రీరాములు, బొమ్మిడి రాజు, ఎడ్ల రాజు, శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రక్తదానం చేసిన మునిగాల సుధాకర్ గౌడ్

**చొప్పదండి ప్రభాతవార్త:**



మండల పరిధిలోని భూపాలపట్నం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మునిగాల సుధాకర్ గౌడ్ అపదలో ఉన్న వారికి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ మేరకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మారం లావణ్య అత్యవసర పరిస్థితులలో రక్తం అవసరం కాగా మునిగాల సుధాకర్ గౌడ్ స్పందించి రక్తదానం చేసి విలువైన ప్రాణాలను కాపాడారు. బ్లడ్ డోనేషన్ మోటివేటర్ లయన్స్ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గొలిపెల్లి నరేష్ రక్తదాతను ప్రత్యేకంగా అభినందించారు. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం వల్ల మరో ప్రాణం నిలుస్తుందని అన్నారు.

## మృతుని కుటుంబానికి 25 వేల పోస్టల్ డిపాజిట్ చేసిన మెకానిక్ అసోసియేషన్..

**కమలాపూర్, ప్రభాత వార్త:**



కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన బూర వెంకటరమణ అనే మెకానిక్ ఈనెల 3న స్థానికంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీకొని మృతి చెందాడు. మృతుని కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చిన శ్రీ వెంకటేశ్వర టూవీలర్ బైక్ మెకానిక్ యూనియన్ ఆర్థిక సాయం చేసి ఆ కుటుంబాన్ని ఆదుకుంది. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకట రమణ మృతితో కుటుంబ పెద్దదిక్కుని కోల్పోగా ఆసరాగా నిలిచిన మెకానిక్ అసోసియేషన్ 25 వేల రూపాయలను తపాలా పోస్ట్ ఆఫీస్ లో ఫిక్స్ డిపాజిట్ చేసి కుటుంబ సభ్యులకు అందజేశారు. తోటి మెకానిక్ కుటుంబానికి మెకానిక్ అసోయేషన్ ఆర్థిక సాయం చేయడాన్ని పలువురు అభినందించగా పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్, ఉపాధ్యక్షులు కొలిపాక శంకర్, ప్రధాన కార్యదర్శి చిలుక రాజేందర్, కోశాధికారి కొండి రాజు, సభ్యులు చేరాల అశోక్, చేరాల నాగరాజు, తిరుపతి పాల్గొన్నారు.

## ఆనంద నిలయంలో దీపావళి వేడుకలు

**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త :**
జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆనంద నిలయం, బాల సదనంలో కళాశ్రీ ఆర్ట్ థియేటర్స్ అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో దీపావళి పండుగ సందర్భంగా చిన్నారులకు టపాసులు, మిఠాయిలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పిల్లల ఆనందోత్సవాల మధ్య బాణాసంచులు కాల్చి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకురాలు, నమిలికొండ సాకేత, గుండేటి యశస్వి, పాత్రికేయులు సిరిసిల్ల వేణుగోపాల్, మండలోజు ప్రసాద్, వార్డెన్ షాబాన తదితరులు పాల్గొన్నారు.



# నామినేషన్ల స్క్రూటి ప్రక్రియను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి




**చొప్పదండి ప్రభాతవార్త:** చొప్పదండి పట్టణంలోని ఎన్నికల అధికారి కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి నామినేషన్ల స్క్రూటినిని ప్రక్రియను పరిశీలించారు. చొప్పదండి రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్‌వేసిన అభ్యర్థుల సమక్షంలో వీటిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి ప్రపుల్ దేశాయ్, తహసీల్దార్ జక్కని నరేందర్, పలువురు రాజకీయ పార్టీలు స్వతంత్ర అభ్యర్థులు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణపై

# పోలీస్ అబ్జర్వర్ తనిఖీ



**మల్యాల, ప్రభాత వార్త:** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మల్యాల మండలంలో ఎన్నికల ఏర్పాట్లపై సోమవారం పోలీస్ శాఖ ఎన్నికల పరిశీలకుడు అడిషనల్ డిజీ సతీష్, గణేష్ మల్యాల పోలీస్ స్టేష్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఎన్నికల బందోబస్తు తదితర అంశాలపై అధికారులకు తగు సూచనలు చేశారు. అంతేకాకుండా ఎన్నికల నిర్వహణపై చేపట్టవలసిన అంశాలపై మండలంలో పోలీస్‌శాఖ తీసుకున్న చర్యలపై ఆయన పరిశీలన జరిపారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించినందుకుగాను పోలీస్‌శాఖ తరపున పకడ్బందీగా ఏర్పాట్లను చేయాలని అన్నారు. ఆయన వెంట జగిత్యాల ఎస్‌సి సన్ ప్రీత్‌సింగ్, జగిత్యాల డిఎస్‌పి వెంకటస్వామి తో పాటు సిఐ కోటేశ్వర్, ఎస్ఐలు అశోక్, కుమారస్వామి ఉన్నారు.

# కొనుగోలు కేంద్రాలు పరిశీలన

**జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :** జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లో ధరూర్, నర్సింగాపూర్, అంతర్గాం, వెల్దుర్తి సెర్ప్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎపియం వి.గంగాధర్ పరిశీలించడం జరిగింది.జిల్లా డిఆర్‌డిఓ ఆదేశాల మేరకు కొనుగోలు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎలాంటి సమస్యలు లేకుండా కొనుగోళ్ల నడుస్తున్నాయి, అలాగే పలు కేంద్రాల్లో తూకం వేసి, మిల్లులకు పంపియడం జరుగుతుందని,రైతులు మంచి సహకారం అందివ్వడం జరుగుతుందని అన్నారు.ఏమైనా సమస్యలు ఉంటే మండల సెర్ప్ అదికారులదృష్టికి తూసుకు రావాలి అని, అట్టి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది.కొనుగోలు ప్రక్రియకి సంబంధించి పుస్తకాల నిర్వహణ, కేంద్రంలో మౌలిక సదుపాయాల గూర్చి కమిటీ వారితో కలిసి పరిశీలించడం జరిగింది.సిసిలు విద్యాసాగర్, గంగారాం, ఆయా కేంద్రాల విఓఏలు, రైతులు, కమిటీ సభ్యులు ఉన్నారు.



# కొండగట్టు అంజన్న ఆలయంలో ఘనంగా దీపావళి వేడుకలు



**మల్యాల, ప్రభాత వార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆలయంలోని అర్ధమండపం ముందు శ్రీరామ పేరుతో దీపాలంకరణ నిర్వహించారు. ఆలయ ఆవరణలో కూడా దీపాలను వెలిగించి శ్రీ స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ మారుతితో పాటు అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలో ఘనంగా దీపావళి వేడుకలు



**వేములవాడ, ప్రభాతవార్త:** వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. దీపావళి సందర్భంగా ఆలయం ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలు అమర్చారు.అరటి తోరణాలతో ఆలయ ద్వారాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో నరక చతుర్దశి, మంగళ హారతులు అభ్యంగనం జరిపారు. సాయంత్రం నరకాసుర వధ పురాణ ప్రవచనం చేశారు. కల్యాణ మండపంలో ధనలక్ష్మి పూజలు, ఆలయ అకౌంట్స్ విభాగంలోని అకౌంట్ బుక్కులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండపంలో అకౌంట్స్ విభాగానికి చెందిన ఉద్యోగులను అర్చకులు ఆశీర్వదించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో స్వామి వారి పెద్ద సేవ ఊరేగింపు చేశారు.

# ధాన్యం మద్ధతు ధర పొందడానికి నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**- అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌లాల్**

**- కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్**



**కాల్వశ్రీరాంపూర్,ప్రభాతవార్త :** రైతులు మద్దతు ధర పొందడానికి నాణ్యత ప్రమాణాలు పాటించాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ లాల్ తెలిపారు.సోమవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ కేంద్రంలో,కాల్వశ్రీరాంపూర్ మండలం మల్యాల గ్రామంలో పర్యటించి ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ రైతులతో,అధికారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకొని,సంబంధిత రిజిస్టర్‌లను పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రంలో మౌళిక వసతులు ఉండే విధంగా చూడాలని తెలిపారు. రైతులు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కొనుగోలు కేంద్రాలకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం పంట తీసుకొని రావాలని,మద్దతు ధర కొరకు నాణ్యత ప్రమాణాలు పాటించాలని,ధాన్యాన్ని బాగా ఆరబెట్టి చెత్త,తాలు,మట్టి పెడలు,రాళ్ల లేకుండా శుభ్రపరచాలని అన్నారు. ధాన్యం కొనుగోలు నిమిత్తం అవసరమైన వాహనాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకొని సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల నుంచి సంబంధిత మిల్లర్లకు కేటాయించాలని సూచించారు. ధాన్యం విక్రయించే సమయంలో తమ వెంట సెల్ ఫోన్ నెంబర్‌ను ఆధార్‌కార్డు,బ్యాంక్ ఖాతాకు లింక్ చేసి తీసుకొని రావాలని,ధాన్యం విక్రయించే సమయంలో ఓటిపి కోసం సెల్ ఫోన్,ఆధార్ కార్డు,పట్టాదార్ పాస్ పుస్తకం,బ్యాంక్ ఖాతా పుస్తకం తీసుకొని వచ్చే విధంగా రైతులకు ముందస్తుగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. రైతులకు మద్దతు ధర విషయంలో ఉండే సందేహాలు,పిర్యాదులను టోల్ ఫ్రీ నంబర్ 1967/18004250033 నందు సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు

# షాడో రిజిస్ట్రర్ నిర్వహించాలి

**- జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత**



**జగిత్యాల బ్యూరో,ప్రభాతవార్త :** శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ షాడో రిజిస్టర్ నిర్వహించాలని అదనపు కలెక్టర్ బిఎస్ లత అన్నారు.సోమవారం రోజున వీడియో సమావేశ మందిరంలో ఎఈఆర్‌ఓ, ఎంసిసి, ఎఫ్‌ఎస్టీ, ఎస్‌ఎస్టీ, టీమ్‌లతో సమావేశం నిర్వహించారు. అనుమతులు లేకుండా వాహనాలు ప్రచారం కోసం వినియోగిస్తున్నారని, ఎంసిఎంసి అనుమతులు లేకుండా కరపత్రాలు, ఫ్లెక్సీలు, స్టిక్కర్లు ప్రచారంలో పంపిణీ చేస్తున్నారని,ఆయా వాటిని పరిశీలించి అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారంలో వినియోగిస్తున్న వాటిని టీమ్‌లు పరిశీలించి చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రచారంలో వినియోగిస్తున్న వీడియో,ఆడియో క్లిప్పులని పరిశీలించాలని అన్నారు. మీ సేవా ద్వారా ధరఖాస్తు చేసుకొని అనుమతులు తీసుకోవాలని అన్నారు. మద్యం, డబ్బు అక్రమ రవాణా జరుగకుండా నిశిత పరిశీలన చేయాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ నోడల్ అధికారులు,మండల స్థాయి నోడల్ టీమ్‌లు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి



**జమ్మికుంట, ప్రభాత వార్త:** విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించిన అధికారులపై శాఖపరమైన చర్యలు తప్పవని కరీంనగర్ సిపి అభిషేక్ మొహంతి అన్నారు. సోమవారం జమ్మికుంట పోలీస్ స్టేషన్ ను కరీంనగర్ సిపి అభిషేక్ మొహంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డును పరిశీలించారు. ఎన్నికల నేరస్థుల, రౌడీ షీటర్ల వివరాలను జమ్మికుంట స్టేషన్ హౌస్ ఆఫీసర్ బర్పాటి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. వీలైనంతా ఎక్కువగా ఫ్లాగ్ మార్చ్, రూట్ మార్చ్, వాహన తనిఖీలు నిర్వహించి ఓటర్లకు శాంతియుత వాతావరణం భద్రతా భావాన్ని కలిగించాలన్నారు. పోలీస్ స్టేషన్ లో ఉన్న సిబ్బందితో వారికి కేటాయించబడ్డ ప్రాంత పరిధీ గురించి అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధీలో గల సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. గతంలో ఎన్నికల సమయంలో గొడవలు చేసిన లేదా అల్లర్లను సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి ఓటర్లను ప్రభావితం చేసే ఎన్నికల నేరస్థులపై రౌడీ షీటర్ల పై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని, ఉల్లంఘిస్తే బైండోవర్ చేసి పూచికత్తు సొమ్ము మొత్తాన్ని జప్తు చేయాల్సి వస్తుందని, జైలు శిక్ష కూడా విధించబడుతుందని వారికి తెలుపాలన్నారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏసిపి జీవన్ రెడ్డి, జమ్మికుంట టౌన్ ఇన్స్పెక్టర్ బర్పాటి రమేష్ తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.